# రసికుడు

నాకు వెంకటాపురం ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ ఊరు నాకు కొత్త. రోడ్డుకు రెండు మూడు మైళ్ల దూరంలో ఉంటుందా ఊరు. వెంకటాపురం ఏమంత పెద్ద ఊరేం కాదు. మామూలుగా అన్ని పల్లెటూళ్లలాగే ఉంది. స్కూలుకెళ్లగానే స్టాఫ్‌రూమ్‌లో యాదగిరి కనిపించాడు. వాడూ, నేనూ క్లాస్‌మేట్స్‌ము. యాదగిరి అదే స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నాడని తెలిసి ఎంతో సంతోషించాను. వాడే నన్ను హెడ్‌మాస్టర్ రూమ్‌లోకి తీసుకెళ్లాడు. జాయినింగ్ రిపోర్టు యిచ్చేశాను. స్టాఫ్‌రూమ్ కొచ్చాము. స్టాఫ్‌నందర్నీ పరిచయం చేశాడు యాదగిరి.

''ఈ ఊళ్ళో రూమ్స్ దొరుకుతాయా?'' అని అడిగాను యాదగిరిని.

''ఇంత త్వరగా ఎక్కడ దొరుకుతాయి. కొంచెం వెతకాలి'' అన్నాడు యాదగిరి.

రూమ్ దొరికేదాకా తనతో ఉండమంటాడేమోనని ఆశించాను. కాని వాడు అలాంటిదేమీ చెయ్యలేదు.

నాలో మెదులుతున్న ఈ భావాన్ని గ్రహించాడా అన్నట్టుగా యాదగిరి అన్నాడు.

''నేను ఉంటున్న ఇల్లు ఏమీ బాగాలేదురా. ఆ చిన్న పోర్షన్లో, నేనూ, మా ఆవిడా, ఇద్దరు పిల్లలూ...''

''ఏమిట్రోయ్ నీకు అప్పుడే ఇద్దరు పిల్లలా?'' అన్నాను.

''ఔను. మరి నీకో?''

''నాకింకా పెళ్ళే కాలేదులే''

''అదృష్టవంతుడివిరా''

మా సంభాషణను వింటున్న వీరయ్య అనే టీచర్ ''మన కామేశ్వరరావు రూమ్‌లో ఉండండి. ఈ ఊరుకు కొత్తగా వచ్చిన యే టీచరైనా కామేశం రూమ్‌లోనే దిగుతాడు. కామేశ్వర్రావు బ్రహ్మచారి. కొండంత ఇల్లు. మీకు రూమ్ దొరికేవరకు ఆయన రూమ్‌లో హాయిగా ఉండొచ్చు'' అన్నాడు.

''ఔన్రోయ్, మరచేపోయాను. నువ్వు కామేశ్వరరావు రూమ్‌లో ఉండే ఏర్పాటుచేస్తాను'' అన్నాడు యాదగిరి.

''కామేశం రూమ్‌లో ఉంటే మీకు టైమ్ కూడా చాలా హాపీగా గడుస్తుంది'' అన్నాడు. వీరయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ, యాదగిరి కూడా అలాగే నవ్వాడు.

''ఏమిటి విశేషం'' అన్నాను.

''తొందరెందుకు. అదే తెలుస్తుంది'' అన్నాడు యాదగిరి.

ఇంతలో బెల్లు కొట్టారు. ఓ క్లాసురూమ్‌లోంచి బయటికి వస్తున్న యువకుడ్ని చూసి ''అడుగో కామేశ్వర్రావు'' అన్నాడు యాదగిరి.

కామేశ్వర్రావుది చాలా అందమైన పర్సనాలిటీ. తెల్లనిరంగు, తుమ్మెద రెక్కల్లాంటి ఉంగరాల జుట్టు, విశాలమైన నుదురు, చక్కని ముక్కు, హుషారుగా ప్రకాశిస్తున్న కళ్లు... టైట్ బ్లాక్ టెర్లిన్ పాంట్, మల్లెపువ్వులాంటి తెల్లని టెర్లిన్ షర్టు... టక్ చేశాడు. ఇన్‌షర్టు అతని పర్సనాలిటీకి బాగా సరిపోయింది. ఓ మారుమూల పల్లెటూరి టీచర్‌లో ఇంత అందం, దర్జా, ఫోజు, స్టయిల్ ఉండటం నన్ను చాలా ఆశ్చర్యపరిచింది. అతన్ని లైక్ చెయ్యకుండా ఉండలేకపోయాను.

''హల్లో కామేశం... మీట్ మై ఫ్రెండ్ అనంతరావు. మన స్కూలుకు టీచర్‌గా వచ్చాడు. మేమిద్దరమూ హైస్కూల్లో క్లాసుమేట్స్‌ము'' అన్నాడు యాదగిరి.

''వెరీ గ్లాడ్ టు సీ యూ'' అన్నాడు నాతో షేక్‌హాండ్ చేస్తూ కామేశ్వరరావు.

''మా అనంతానికి రూమ్ దొరికేవరకు మీ రూమ్‌లోనే ఉంటాడు'' అన్నాడు యాదగిరి.

''ఓ దానికేం అలాగే'' అన్నాడు కామేశ్వరరావు. నా గుండెలు కుదుటపడ్డాయి.

''మీరిప్పుడు ఎక్కణ్ణించి వస్తున్నారు'' అన్నాడు కామేశం.

''వరంగల్ నుండి'' అన్నాను.

''ఏం సినిమా లాడుతున్నాయండీ. ఈ మధ్య సిటీకి వెళ్లక వారం పదిరోజులు అవుతోంది'' అన్నాడు కామేశం.

''పగ సాధిస్తా. ధర్మదాత...'' అన్నాడు.

''పగ సాధిస్తాలో సెక్సు బాగా ఉందని ప్రచారమౌతోంది. మీరు చూశారా? ఏవో రేప్ సీన్స్ ఉన్నాయట. బాగా తీశారా'' అన్నాడు కామేశ్వరరావు.

యాదగిరి, వీరయ్య ఒకరి మొఖం ఒకరు చూసుకొని నవ్వుకోవడం గమనించాను.

లాంగ్‌బెల్ కొట్టారు. నన్ను కామేశ్వరరావు రూమ్‌లో దింపి యాదగిరి వెళ్లిపోయాడు. ఆ ఇల్లు కూడా కామేశ్వరరావులాగే చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంది. ఈ పల్లెటూర్లో ఇంత అందమైన ఇల్లు దొరకడం ఆశ్చర్యమే. ఇంట్లోకి వెళ్లడంతోనే డ్రాయింగ్ రూమ్ గోడలనిండా సినిమాతారల బొమ్మలు – చాలా వరకు నగ్నంగా, అర్ధనగ్నంగా ఉన్నవే – వేలాడుతున్నాయి. ఏమైనా కామేశ్వరరావు మంచి రసికుడనుకున్నాను.

''మీకు పెళ్ళయిందా?'' లోపలకు వెళ్లడంతోటే అడిగాడు కామేశ్వరరావు.

''ఇంకా కాలేదండి'' అన్నాను.

''వెరీగుడ్. మనలాగే మీరూ బ్రహ్మచారులన్నమాట... కాదు... పెళ్లికాని వాళ్ళు అంటే బావుంటుందేమో'' అన్నాడతడు నవ్వుతూ.

బట్టలు మార్చుకున్నాను. అతడు లోపల కెళ్లాడు. ఇల్లు చాలా పెద్దదే లోపల మరో మూడు నాలుగు గదులున్నట్టున్నాయి. లోపల్నించి కామేశ్వరరావు మొహం కడుక్కుని వచ్చాడు.

''మీరు మొహం కడుక్కుంటారా... లేక స్నానమే చేస్తారా?'' అన్నాడు.

''స్నానం చేస్తాను'' అన్నాను.

''కానీయండి – మీరు స్నానం చేసేటప్పటికి మీల్స్ రెడీ అవుతుంది'' అన్నాడు.

''అంటే మీల్స్ మీరు స్వయంగా...''

''అబ్బే. మా పనిమనిషి లక్ష్మి ఉంది''

నేను తువ్వాలు తీసుకుని భుజాన వేసుకుంటుండగా బయట గాజుల చప్పుడైంది.

''రా లక్ష్మీ, రా. ఇదిగో ఈవేం మా పనిమనిషి'' అన్నాడు కామేశ్వరరావు. లక్ష్మి లోపలకొచ్చింది. లక్ష్మిని చూసి బిత్తరపోయాను. లక్ష్మి పనిమనిషా? లక్ష్మి పనిమనిషిలా లేదు. మంచి ఘరానా కుటుంబానికి చెందిన స్త్రీలాగుంది. లక్ష్మి అందంగా ఉంది. అందంగా అలంకరించుకుంది కూడా.

లక్ష్మి వంటింట్లోకి వెళ్లి స్టౌ ముట్టించింది.

నేను స్నానానికి బావిమీదకు వెళ్లాను.

లక్ష్మి కళ్లల్లో వున్న కైపు నాకు చక్కిలిగింతలు పెట్టసాగింది. కామేశ్వరరావును గూర్చి స్టాఫ్‌రూమ్‌లో మా యాదగిరి, వీరయ్య ఎందుకలా మాట్లాడారో అర్థమైంది. స్నానం చేసొచ్చి రూమ్‌లో కూర్చునాన్ను. కామేశ్వరావు మరో రూమ్‌లో యేదో చదువుతూ పడుకున్నాడు. లక్ష్మి వంట చేస్తోంది.

షెల్ఫ్‌లో చాలా పుస్తకాలున్నాయి. ఓ పుస్తకం చేతిలోకి తీసుకున్నాను. ఆ పుస్తకం కూడా ఆశ్చర్యపరిచింది. వరుసగా ఓ సంవత్సరం అభిసారికల్ని బైండు చేయించిన పుస్తకమది. షెల్ఫ్‌లో ఉన్న మరో పుస్తకాన్ని చూశాను. యే పుస్తకం చూసినా సెక్స్‌ను గూర్చిన పుస్తకమే. నాకు భయమేసింది. రెండు మూడు రోజులు ఈ ఇంట్లో ఉంటే నా బుర్రంతా సెక్స్‌తో నిండిపోయేట్టుంది.

కాసేపట్లో 'వంటయ్యిందయ్యా' అన్న లక్ష్మి కేక వినిపించింది.

''కమాన్ అనంతంగారు'' అని పిల్చాడు కామేశ్వరరావు. నేను వంటగదిలోకి వెళ్లాను.

''మా లక్ష్మి వంట అద్భుతంగా చేస్తుంది అన్నాడు లక్ష్మి కళ్లల్లోకి చూస్తూ. లక్ష్మి చాలా అందంగా సిగ్గుపడింది. వాళ్లిద్దరూ ప్రేయసీ, ప్రియులనటంలో సందేహం లేదు.

అనుకున్నాను.

నిజంగానే లక్ష్మి వంట అద్భుతంగా ఉంది.

కామేశ్వర్రావు అదృష్టవంతుడు. పెళ్ళి కాకుండానే స్వర్గసౌఖ్యాలను అనుభవిస్తున్నాడు. అతడిమీద నాకు ఈర్ష్య కలిగింది.

* * *

కామేశ్వర్రావు రూమ్‌కు మా టీచర్స్‌లో చాలామంది వస్తుండేవాళ్ళు. కామేశ్వర్రావు అంటే నాకే కాదు. మా టీచర్స్‌లో చాలామందికి ఈర్ష్య ఉంది. కారణం అతడు చీకూ చింతాలేని విలాస జీవితాన్ని గడుపుతున్నాడని.

కామేశ్వర్రావుని గూర్చి చాలా విషయాలు తెలిశాయి. అతడు బాగా డబ్బున్న కుటుంబానికి చెందినవాడు. ఉద్యోగం కేవలం సరదా కోసం చేస్తున్నాడు. అతనికి పిల్లనిస్తామని చాలామంది వచ్చారు. వేలకువేల కట్నమిస్తామన్నారు. కాని కామేశ్వర్రావు యేదో వంకతో సంబంధాలనన్నింటిని తిరగ్గొట్టాడు.

పైకి యువకుడుగానే కనిపిస్తున్నా కామేశ్వర్రావుకు చాలా యేళ్లుంటాయంటారు మా టీచర్స్‌లో చాలామంది. కామేశ్వరరావుకు ఆ ఊళ్ళో ఒక్క లక్ష్మితోనే గాక చాలామందితో సంబంధముందట. అతడు చాలా అందమైన వాళ్ళను పనిమనుషులుగా పెట్టుకుంటాడట. అయితే అతని దగ్గర యే పనిమనిషైనా రెండు నెలల కంటే ఎక్కువ వుండదట. ఉన్నన్ని రోజులు వాళ్లకు చీరెలు జాకెట్లు విరివిగా కొనిస్తాడట.

సెలవులున్న రోజుల్లో మా టీచర్స్ అందరూ కామేశ్వర్రావు ఇంటికొచ్చి పేకాడుతూ గంటల తరబడి కూర్చునేవాళ్ళు. సంభాషణలో చాలాభాగం సెక్స్‌ను గూర్చి అంతవరకు కామేశ్వర్రావు దగ్గర పనిమనుషులుగా పనిచేసిన ఆడవాళ్లను గూర్చి సాగేది.

'ఆడవాళ్లను ఎలా పట్టాలో మాకు కొంచెం చెప్పవోయ్ గురూ' అంటూండేవాళ్ళు. కామేశ్వర్రావు అదోమాదిరిగా నవ్వి ఊరుకునేవాడు.

లక్ష్మి ఆ ఇంటికి చాలాసార్లు వచ్చిపోతుండేది. పొద్దున్నే చీకటితోనే వస్తుండేది. ముందు రూమ్‌లో నేనే పడుకుంటాను కాబట్టి నేనే లేచి తలుపు తీస్తుండేవాడ్ని. నా నిద్రమత్తు కళ్లకు లక్ష్మి జగదేక మోహనంగా కనిపించేది. కామేశ్వర్రావు లోపల రూమ్‌లో పడుకునేవాడు. ఎందుకో ఆ రూమ్‌లోకి ఎవర్నీ రానిచ్చేవాడు కాడు. అతడు లేనప్పుడు ఆ రూమ్‌కు తాళం వేసి తాళం చెవి తన దగ్గర దాచుకునేవాడు. తలుపుతీసి నేను మళ్లా నిద్దరపోతుండేవాడ్ని. లక్ష్మి లోపలకెళ్ళి వంటింట్లోంచి అంట్లను బావిమీదకు తీసుకుపోతున్న చప్పుడు వినిపించేది. లక్ష్మి, కామేశ్వరరావు ఎప్పుడు కలుసుకుంటారో నాకు తెలిసేది కాదు.

ఒకరోజు ఇద్దరమూ స్కూలునుండి వచ్చాము. కామేశ్వర్రావు తన రూమ్‌లోకి వెళ్లిపోయాడు. ఇంతలో మా స్కూల్ ప్యూన్ పరుగెత్తుకుంటూ వచ్చి –

'కామేశ్వర్రావుగార్ని వెంటనే హెడ్‌మాస్టర్ రమ్మంటున్నా'డని చెప్పాడు. కామేశ్వర్రావు హడావుడిగా వెళ్లిపోతూ తన రూమ్‌కు తాళం వెయ్యటం మరిచిపోయాడు. మా రూమ్‌లో యేముందో చూడాలన్న కోరికను అణుచుకోలేకపోయాను. బయటి తలుపు గడియవేసి ఆ రూమ్‌లోకి వెళ్లాను.

ఆ రూమ్ గోడలనిండా పూర్తిగా నగ్నంగా ఉన్న ఆడవాళ్ల బొమ్మలున్నాయి. అమెరికానుండి వచ్చే ఫోటోగ్రఫీ మ్యాగజైన్స్‌లోనుండి కట్‌చేసిన బొమ్మలవి. టేబుల్‌మీద అట్లాంటి మ్యాగజైన్స్ ఇంకా చాలా పడివున్నాయి.

టేబుల్‌మీదనే ఓ కవర్లో కొన్ని ఫోటోలున్నాయి. ఆ ఫోటోలన్నీ బట్టల్లేకుండా ఉన్న ఆడవాళ్లవే. అందులో ఓ ఫోటో నన్ను షాక్ చేసింది. అది లక్ష్మి ఫోటో. బట్టల్లేకుండా ఉన్న లక్ష్మి ఫోటో! వివిధ కోణాల్లో లక్ష్మిని ఫోటోలు తీశాడు కామేశ్వరరావు.

బయట ఎవరో తలుపు కొట్టిన చప్పుడైంది. హడావుడిగా ఆ పుస్తకాలక్కడ పడేసి వెళ్లి తలుపు తీశాను. బట్టల్లేని లక్ష్మికంటే బట్టలున్న లక్ష్మి వెయ్యిరెట్లు అందంగా కనిపించేది.

లక్ష్మి లోపలకొచ్చింది. తెరిచి ఉన్న కామేశ్వర్రావు రూమ్ చూసి, నాకేసి దొంగను చూసినట్టుగా చూసింది.

లక్ష్మి వెంటనే ఆ రూమ్ మూసేసి తాళం వేసింది. ఆ తెల్లారే కామేశ్వరరావు నన్ను అడిగాడు. 'మీకింకా రూమ్ దొరకలేదా?' అని.

ఎంత త్వరగా మీరు ఈ రూమ్‌లోంచి వెడితే అంత మంచిది. అన్న అర్థం ధ్వనించింది ఆ మాటలో.

ఆ తెల్లారే కామేశ్వరరావుకు థాంక్స్ చెప్పి ఆయన ఇంట్లోంచి బయటపడ్డాను.

* * *

మా టీచర్స్‌లో చాలామంది కామేశ్వర్రావు ముందు అతన్ని ఎంతో పొగిడేవాళ్లు. కాని అతని పరోక్షంలో అతన్ని తిడ్తుండేవాళ్లు.

కామేశ్వరరావు కనిపించినప్పుడల్లా 'యేమోయ్ కామేశ్వరరావు పెళ్లెప్పుడు? బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా మంచిది కాదు సుమా'' అని బెదిరించేవాళ్లు.

ఇలా ఉండగా ఒకరోజు అకస్మాత్తుగా కామేశ్వర్రావు పెళ్లి నిర్ణయమైపోయిందన్న వార్త వినవచ్చింది. కామేశ్వర్రావు ఆ వార్తను ధృవపరిచాడు. మా వాళ్లకు గుండెలమీది భారం తొలగిపోయినట్టు బోలెడు రిలీఫ్‌ను ఫీలయ్యారు. ఇంతలో శుభలేఖలు కూడా వచ్చాయి. పదివేల వరకు కట్నం ఇస్తున్నారట. అమ్మాయి చాలా అందమైందనే అందరూ అనుకున్నారు. ఈ సంబంధాన్ని వప్పుకోకపోతే విషంతాగి చస్తానని కామేశ్వరావు తల్లి బెదిరిస్తే అతడు ఈ పెళ్ళికి ఒప్పుకున్నట్టుగా అందరూ చెప్పుకున్నారు.

పెళ్లి వారం రోజులుందనగానే కామేశ్వరరావు సెలవుపెట్టి వెళ్లిపోయాడు. కామేశ్వరరావు పెళ్లికి మాలో ఎవళ్ళూ వెళ్లలేదు.

* * *

పెళ్లయిన మూడోనాడే కామేశ్వర్రావు హడావుడిగా వూడిపడ్డాడు. పసుపు బట్టలతోనే, కాళ్లకు పూసిన పారాణి ఆరకుండానే కామేశ్వరరావు అలా వచ్చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది.

''యేంవోయ్ అప్పుడే వచ్చేశావు'' అని అడిగారు మావాళ్లంతా. ఎందుకో కామేశ్వరరావు చాలా చీకాకుగా, అదో మాదిరిగా కనిపించాడు. ఎన్నడూ లేంది అతని గడ్డం మాసి ఉంది. అతని బట్టలు కూడా నలిగిపోయి ఉన్నాయి. మా వాళ్లంతా 'పార్టీ... పార్టీ' అని అరిచారు.

''ఓ అలాగే! రేపే మీకు పార్టీ అరేంజ్ చేస్తాను'' అన్నాడు కామేశ్వరరావు.

ఆ తెల్లారి పొద్దున్నే లేచి మొహం కడుక్కుంటున్నాను. మా స్టూడెంట్స్‌లో ఒకడు పరుగెత్తుకుంటూ వచ్చి –

''కామేశ్వర్రావు సారు ఇంటిముందు చాలామంది గుమిగూడారు సార్'' అన్నాడు.

నా గుండెలు ఝల్లు మన్నాయి. ఎవరో వచ్చి కామేశ్వర్రావు ఇంట్లోకి వెళ్లగా ఎవరో చూసి ఉంటారు. ఆ గొడవ అదే అయ్యుంటుందనుకున్నాను. కామేశ్వరరావుకు బొత్తిగా ఆత్మనిగ్రహం లేదు. పెళ్ళయి రెండు రోజులు కాలేదు. అప్పుడే ఇంత పని చేస్తాడా అనుకున్నాను.

ఇంతలో మా కాలేజీ ఫ్యూన్ పరుగెత్తుకుంటూ వచ్చి 'కామేశ్వర్రావుసార్ నిద్రమాత్రలు మింగాడట సార్'' అన్నాడు.

''ఏమిటి నిద్రమాత్రలా'' అన్నాను.

''ఔను సార్! ప్రాణం పోయిందంటున్నారు'' అన్నాడు వాడు యేడుస్తూ.

నాగుండెలో యేదో దడ ప్రారంభమైంది. బట్టలేసుకొని కామేశ్వరరావు ఇంటివైపు పరుగెత్తాను.

ఇంటిముందు ఆ ఊరివాళ్లంతా గుమిగూడారు. అందర్నీ తోసుకుని లోపలకు వెళ్లాను. లక్ష్మి ఓ మూల కూర్చొని యేడుస్తోంది. కామేశ్వర్రావు ఎప్పుడూ పడుకునే గదిలోకి వెళ్ళాను. అప్పటికే అక్కడకు మా స్కూలు హెడ్‌మాస్టర్, టీచర్స్ వచ్చేశారు.

మంచంమీద కామేశ్వర్రావు పడి ఉన్నాడు. మంచం చుట్టూ ఆ రూమ్ నిండా బ్లేడుతో కట్ చేసిన పుస్తకాలు, ఫోటోలు చిందరవందరగా పడివున్నాయి. కామేశ్వర్రావు రూమ్‌లో నేను అంతకుముందు చూసిన నగ్న సుందరీమణుల ఫోటోలన్నింటినీ ముక్కలు ముక్కలుగా కోసి ఆ రూమ్ నిండా వెదజల్లినట్టున్నాడు. మంచం పక్కనే నిద్రమాత్రల

డబ్బా పడివుంది. అతని కాళ్లకు పెళ్లినాడు పూసిన పసుపు పారాణి ఇంకా ఆరలేదు.

''ప్రాణం పోయిందా?'' అన్నాను.

''ఎప్పుడో పోయింది'' అన్నాడు మా హెడ్‌మాస్టర్.

కామేశ్వర్రావు రాసిన ఆఖరు ఉత్తరాన్ని మా హెడ్‌మాస్టర్ చూపించాడు. ''ఆత్మహత్య చేసుకుంటున్నాను. ఇందుకెవరూ బాధ్యులు కారు'' అని ఉంది. మంచం పక్క స్టూలుమీద ఉందిట ఆ చీటీ.

* * *

కామేశ్వర్రావు ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు? ఆ ఊర్లోని ప్రతివాడి నోటా ఇదే ప్రశ్న. ఎవరి ఇష్టమొచ్చినట్టుగా వాళ్లు ఊహాగానాలు చేశారు. మా టీచర్స్‌లో కొందరు 'లక్ష్మికి అతనికి బెడిసిం'దన్నారు. 'అతనికి ఇష్టంలేని పెళ్లి చేశా'రన్నారు. 'పెళ్లి కూతురుకు ఇదివరకే ఎవరితోనే సంబంధం ఉన్నట్టు కామేశ్వర్రావుకో ఆకాశరామన్న ఉత్తరం వచ్చిం'దన్నాడు. కామేశ్వర్రావు ఆత్మహత్యకు ఇవేవీ సరియైన కారణాలుగా నాకు కనిపించలేదు.

రెండు మాసాల తర్వాత మా యాదగిరికి కామేశ్వర్రావువాళ్ల బంధువెవరో ఒక వార్త చెప్పారట. 'కామేశ్వర్రావు శోభనపు గదిలోంచి పారిపోయి వచ్చాడు' అని. ★

(వసుధ – మార్చి 1971)